క్లుప్తంగా

రైతుబజారు స్టాళ్లకు డ్రా



డ్రా తీసి రైతుకు టోకెన్ ఇస్తున్న రైతుబజారు ఈవో కొండబాబు

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారులో శుక్రవారం రైతుల స్టాళ్లకు డ్రా తీశారు. బజారులోని 65 దుకాణాల్లో వ్యాపారం నిర్వహణకు రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతీ వారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి కల్యాణం



కల్యాణోత్సవంలో సిద్ధిబుద్ధి సమేత గణపతి

సీతమ్మధార : సిద్ధిబుద్ధి సమేత గణపతి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల శ్రీ మహాగణపతి ప్రసన్న వేంకటేశ్వర అయ్యప్ప శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో కల్యాణం, హోమం, ఇతర పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది శివ, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దీపారాధన



దీపాలంకరణలో గణనాథుడు

మురళీనగర్ : మురళీనగర్ సమీపంలోని అయ్యప్పనగర్‌లో స్థానికుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథునికి శుక్రవారం రాత్రి దీపారాధన చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం వినాయకుడి ఆకృతిలో రంగవల్లులు ఏర్పాటు చేసి దీపాలంకరణ చేశారు. ఈ సందర్భంగా బాలికలు ప్రదర్శించిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది.

వర్షంతో ఉపశమనం



సత్యానగర్ కాలనీలో కురుస్తున్న వర్షం

మురళీనగర్ : మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ మండిపోవడంతో ప్రజలు ఉక్కపోతతో సతమతమయ్యారు. సాయంత్రం 5 గంటల వరకు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం 5.15 గంటలకు ఆకాశం మేఘావృతమై చిరు జల్లులతో ప్రారంభమైన వర్షం కుండపోతగా కురిసింది. దీంతో వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు.

టాయ్‌లెట్లకు తాళాలు

- బస్ బేల వద్ద టాయ్‌లెట్లు నిర్మించిన గత ప్రభుత్వం
- నేటికీ వాటిని వినియోగంలోకి తీసుకురాని అధికారులు
- అత్యవసర వేళల్లో ప్రయాణికులకు అవస్థలు



సీఎంఆర్ సెంట్రల్ బస్టాప్ వద్ద తాళాలు వేసి ఉన్న టాయ్‌లెట్లు



గురుద్వారా బస్టాప్ వద్ద తాళాలు వేసి ఉన్న టాయ్‌లెట్లు

సీతమ్మధార : స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా లక్షలాది రూపాయల ఖర్చుతో బస్‌బేలు ఆధునికీకరించి.. వాటికి సమీపంలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన టాయ్‌లెట్లను అధికారులు వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. మరోవైపు అత్యవసర వేళల్లో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇదీ ముఖ్యమైన కూడళ్లలోని బస్‌బేల వద్ద పరిస్థితి. జోన్ – 3 పరిధి జీవీఎంసీ 24వ వార్డులో గల రేసపువానిపాలెం సీఎంఆర్ సెంట్రల్ బస్టాప్, 14వ వార్డు గురుద్వారా బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన టాయ్‌లెట్లు ఇప్పటికీ ప్రయాణికులకు అందుబాటులోకి రాకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా కూడళ్లలో ఒక్కో బస్‌బే, టాయ్‌లెట్ల నిర్మాణానికి గత ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేసింది. సీఎంఆర్ సెంట్రల్ పక్కన రూ.32 లక్షలు, గురుద్వారా కూడలిలో రూ.42 లక్షలు చొప్పున ఖర్చు చేశారు. అంత ప్రజాధనం వెచ్చించి నిర్మించినా ప్రజలకు ఉపయోగపడడం లేదు.

ప్రయాణికులకు తప్పని అవస్థలు

జాతీయ రహదారిపై కీలకమైన గురుద్వారా, సీఎంఆర్ సెంట్రల్ కూడళ్ల నుంచి నిత్యం వేలాది మంది బస్సులు, ఆటోల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా కాలకృత్యాలు తీర్చుకునేందుకు వీలుగా టాయ్‌లెట్లు నిర్మించారు. బస్ బేలు ప్రారంభించినప్పుడే వీటిని కూడా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నప్పటికీ ఆ పని చేయలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ వాటికి తాళాలు వేసేసి ఉంచేశారు. దీంతో అత్యవసర వేళల్లో వృద్ధులు, మహిళలు, పిల్లలు సౌచాలయం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. గురుద్వారా వంటి బస్ షెల్టర్ల వద్ద విజయవాడ, కాకినాడ, రాజమండ్రి, హైదరాబాద్ తదితర దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఎక్కువ సమయం నిరీక్షిస్తుంటారు. విద్యార్థులు కూడా అధిక సంఖ్యలో ఇక్కడ వేచి ఉంటారు. వారంతా టాయ్‌లెట్ల కోసం ఇబ్బంది పడుతున్నా జోన్ – 3 అధికారులకు చీమ కుట్టినట్టయినా వుండడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ భారమని భావించే అధికారులు వీటిని అందుబాటులోకి తీసుకురాలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు టాయ్‌లెట్లకు తాళాలు తీసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి



గత ఏడాది నిర్మించిన ఆధునిక బస్‌షెల్టర్ల వద్ద టాయ్‌లెట్లు ఉన్నా సరే వినియోగంలోకి రాకపోవడం విచారకరం. నిత్యం వేలాది మంది బస్సుల కోసం వేచి ఉండే బస్ షెల్టర్ల వద్ద లక్షలాది రూపాయలతో నిర్మించిన టాయ్‌లెట్లకు తాళాలు వేసి ఉంచడం అధికారుల నిర్లక్ష్యమే అని చెప్పాలి. వెంటనే తాళాలు తీసి, అందుబాటులోకి తీసుకురావాలి.

– దేవీరెడ్డి రాధ, సీతమ్మధార

అధికారుల నిర్లక్ష్యం వల్లే..



ఆధునిక బస్‌షెల్టర్ల వద్ద గత ప్రభుత్వం టాయ్‌లెట్లు నిర్మించడం సంతోషకరం. కానీ వాటికి ఇప్పటికీ తాళాలు వేసి ఉంచడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం ముందుగానే బస్ షెల్టర్‌కి చేరుకుంటారు. ఆ సమయంలో కాలకృత్యాల కోసం టాయ్‌లెట్లు అందుబాటులో లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

– డి.తన్వి, సీతమ్మధార

విద్యార్థులకు మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

సీతంపేట : శ్రీసాయి సరిగమప ట్రస్ట్, బృందావన హెల్పింగ్ హ్యాండ్స్ సంయుక్తంగా 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో గల జీవీఎంసీ హైస్కూల్‌లో శుక్రవారం వన సంరక్షణ, వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 500 మంది విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ ముక్కా శ్రావణి, హెచ్‌ఎం బి.లక్ష్మీ నరస, సంస్థ వ్యవస్థాపకులు హర్షవల్లి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రేవు రత్నకుమారి, ఉపాధ్యాయులు మాణిక్యం, సునంద్, కిషోర్, ధర్మారావు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ వంగల అప్పలరాజు, సాయి సరిగమప సభ్యులు సుబ్రహ్మణ్యం, గోవిందరాజు, శ్యామల, సాయి కుమార్, దుర్గా ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆటో టైర్ల అపహరణ



టైరు దొంగలించిన తర్వాత ఆటో

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ పరిధి సంకురుపేట, పాత ఐటీఐ, గజపతినగర్ ప్రాంతాల్లో ఆటో టైర్ల దొంగలు హల్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్, టైర్లను దొంగలు, ఆకతాయిలు అపహరిస్తున్నారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో దొంగతనాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడని పలువురు ఆరోపిస్తున్నారు. గత రాత్రి సంకురుపేటలో పార్కు చేసిన ఓ ఆటో వెనుక టైర్లు రెండింటినీ దొంగలు తొలగించి తీసుకుపోయారు. ఆటోతోనే జీవనం సాగిస్తున్నామని, దొంగల చర్యతో జీవనోపాధి పోయిందని సంబంధిత ఆటో డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశాడు. దొంగతనంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

'యూ జీనియస్ 3.0' క్విజ్ పోటీల విజేత డీపాల్



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



జోనల్ విజేతలకు జ్ఞాపికలు బహూకరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

సీతంపేట: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో 8 నుంచి 12 ఏళ్ల వయసు గల విద్యార్థులకు 'యూ జీనియస్ 3.0'నేషనల్ జనరల్ అవేర్‌నెస్ క్విజ్ కాంపిటీషన్–2024 పోటీలు జరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 116 పాఠశాలల నుంచి 435 బృందాలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ముఖ్య అతిథిగా జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానం, ప్రతిభా పాటవాలు ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా గుర్తించవచ్చన్నారు. ఈ పోటీల్లో డిపాల్ స్కూల్ విజేతగా, విశాఖ వ్యాలీ స్కూల్ రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బహుమతులు, జ్ఞాపిక, ధ్రువీకరణపత్రాలు అందించారు. ఈ రెండు జట్లు ముంబయిలో జరగనున్న గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. గ్రాండ్ ఫినాలే విజేతకు రూ.2 లక్షలు, మొదటి రన్నర్‌కు రూ.లక్ష, రెండవ రన్నర్‌కు రూ.50 వేలు బహూకరిస్తారన్నారు. యూనియన్ బ్యాంకు జోనల్ హెడ్ షాలిని మీనన్, డిప్యూటీ జోనల్ హెడ్‌లు దేవర శంకరరావు, శంకర్ హెంబ్రామ్, విశాఖ రీజనల్ హెడ్ నరసింహకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సిరుల తల్లికి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు,వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈవో మాట్లాడుతూ ప్రతి శుక్రవారం అమ్మవారికి క్షీరాభిషేక సేవ ఉంటుందని తెలిపారు. కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ప్రతినిధులు తెలిపారు.

'ఎగుమతి వ్యాపారం'పై సర్టిఫికెట్ కోర్సు

విశాఖ సిటీ: ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫ్యాప్సీ) ఆధ్వర్యంలో 'ఎగుమతి వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలి'అన్న అంశంపై ఐదు రోజుల ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి పి.వైదేహి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ సెషన్లు ఉంటాయని వివరించారు. కొత్త వ్యాపారవేత్తలను ఎగుమతి వ్యాపారంలోకి ప్రోత్సహించేందుకు ప్రముఖ సంస్థల నుంచి నిపుణులు, కన్సల్టెంట్ల ద్వారా ఈ సెషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మర్చంట్ ఎగుమతిదారులు, తయారీదారులు, సర్వీస్ ప్రొవైడర్లు, ఎస్‌ఎంఈలు, వ్యాపారులు, భావి ఎగుమతిదారులు/వ్యాపారవేత్తలు ఈ ఆన్‌లైన్ ప్రోగ్రాంకు హాజరుకావచ్చన్నారు. ఇతర వివరాలకు 93914 22821కు సంప్రదించవచ్చు.

వైభవునికి నేడు సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారని, అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తామని తెలిపారు.

పోరాటాలే సీతారామ్ ఊపిరి

సీతంపేట : సీపీఎం ప్రధాన కార్యదర్శి, మార్క్సిస్ట్ మేధావి కామ్రేడ్ ఏచూరి సీతారామ్ మృతి భారత ప్రజలకు తీరని లోటని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి.శ్రీరామమూర్తి, జె.రవి ఒక ప్రకటనలో తెలిపారు. 2019లో మోడీ ప్రభుత్వం జమ్ము కాశ్మీర్‌ను బహిరంగ జైలుగా మార్చినపుడు దానిని వ్యతిరేకిస్తూ గొంతు ఎత్తిన నేత ఏచూరి అని, 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్ పునర్వవస్థీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ప్యాకేజీలతో విభజన నష్టాలను పూడ్చలేరని, దీర్ఘకాలం సహాయం అందించాలని ఆ బిల్లును వ్యతిరేకించిన మేధావి సీతారామ్ అని గుర్తు చేశారు. పోరాటాలే ఆయన ఊపిరి అని, భారత రాజ్యాంగ మౌలిక లక్ష్యాలకు ముప్పు వాటిల్లుతుందని ఆనాడే నినదించారని పేర్కొన్నారు.

17న కాళీ కాలభైరవ కల్యాణం

సీతంపేట : పౌర్ణమి సందర్భంగా ఈ నెల 17న సాయంత్రం 6:30 గంటలకు అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో శ్రీకాళీ కాలభైరవ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొనదలచిన దంపతులు పీఠం కార్యాలయంలో గానీ, 98492 86779లోగానీ సంప్రదించాలని కోరారు.

రైతుబజార్‌లో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట : నరసింహనగర్ రైతు బజార్‌లో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహా అన్న సమారాధన నిర్వహించారు. రైతులు, బజారు సిబ్బంది సహకారంతో సుమారు 1600 మంది భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ, మార్కెటింగ్ శాఖ సిబ్బంది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రాం శీతాకాల ప్రవేశాలు ప్రారంభం

బీచ్‌రోడ్డు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ) ప్రోగ్రాం కోసం శీతాకాల ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రోగ్రాం ద్వారా అభ్యర్థులకు సమగ్ర నిర్వహణ సామర్థ్యాలను అందించడమే లక్ష్యమని ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధునాతన మేనేజ్‌మెంట్ నైపుణ్యంతో పని చేసే నిపుణులను శక్తివంతం చేయడం లక్ష్యంగా టైమ్స్‌ప్రో సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ ప్రోగ్రాం వ్యూహాత్మక దూరదృష్టితో, విశ్వాసంతో ఆధునిక వ్యాపార చిక్కులను నేర్పుగా తొలగిస్తూ ముందుకు వెళ్లగల నాయకులను తయారు చేయడానికి రూపొందించిందని వెల్లడించారు. మార్కెటింగ్, ఆర్థికశాస్త్రం, ఫైనాన్స్, అకౌంటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, మానవ వనరులు, వ్యూహాత్మక ఆలోచన, ఉత్పత్తి, ఆపరేషన్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బిజినెస్ ఎథిక్స్, చట్టం తదితర అంశాలు ఈ ప్రోగ్రాంలో ఉంటాయని వివరించారు.

'విష్ణు గణపతి' అలంకారంలో దుర్గా గణపతి



సీతంపేటలో 'విష్ణు గణపతి' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గా గణపతి

సీతంపేట : వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సీతంపేటలో కొలువైన దుర్గా గణపతి ఏడో రోజు శుక్రవారం 'విష్ణు గణపతి' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం ఆలయంలో గణపతి హోమం, స్వామి వారికి పంచామృత అభిషేకం, చందన, విభూది, ఫల రసాలతో విశేష అభిషేకాలు చేశారు. శనివారం 'ఆదిత్య గణపతి' అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఉత్సవ కమిటీ ఛైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు.

పారిశుధ్య కార్మికుల సేవలు భేష్



పారిశుధ్య కార్మికులకు సరకులు అందజేస్తున్న కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు

సీతంపేట : విజయవాడలో సంభవించిన వరదల కారణంగా సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న జీవీఎంసీ 44వ వార్డు పారిశుధ్య కార్మికులను ఆ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారికి నిత్యావసర సరకులు అందజేశారు. బియ్యం, కందిపప్పు, పంచదార, ఆయిల్, సేమ్యా, టీపొడి, కూరగాయలు పంపిణీ చేశారు. వీధులను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యం కోసం పారిశుధ్య కార్మికులు శ్రమిస్తున్నారన్నారు. కరోనా సమయంలో వారందించిన సేవలు మరిచిపోక ముందే మరోసారి విజయవాడలో వరద బాధిత ప్రాంతాల్లో విశేష సేవలందించారని కొనియాడారు. వారికి ప్రోత్సాహకంగా నిత్యావసర సరకులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, గోపి, రాజు, వెంకట్, ప్రకాష్, యోగి, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

మర్రిపాలెం : ఇటీవల వినాయక నిమజ్జన వేడుకల సందర్భంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దాడికి పాల్పడడంతో కంచరపాలెం పోలీసులు ఒకరిపై కేసు నమోదు చేశారు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి సూర్యానగర్ వద్ద గురువారం రాత్రి వినాయక నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. ఈ సమయంలో కంచరపాలెం పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు నారాయణ, భూలక్ష్మి, అక్కునాయుడు, ఎస్పీ రమణ విధుల్లో ఉన్నారు. ఈ క్రమంలో రాత్రి 10 : 30 గంటలు దాటిందని, నిబంధనలు అతిక్రమించకూడదని, సౌండ్ సిస్టమ్ ఆపాలని నిర్వాహకులను కోరారు. అయినా పట్టించుకోకుండా నిర్వాహకులు, స్థానిక యువకులు కలిసి చిందులేశారు. ఈ విషయమై పోలీసులు మరోసారి చెప్పడంతో సత్యనగర్ ప్రాంతానికి చెందిన నీలపు రమేష్ దురుసుగా ప్రవర్తించడంతో కానిస్టేబుల్ రమణ కింద పడిపోయారు. దీంతో అతను కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సత్యనగర్‌కు చెందిన నీలపు రమేష్‌ను అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా హిందీ వారోత్సవాలు



విద్యార్థినులతో హిందీ అధ్యాపకులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి నేతృత్వంలో శుక్రవారం హిందీ వారోత్సవాలు కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ ఘనంగా ప్రారంభించారు. వీఎస్ కృష్ణ ప్రభుత్వ కళాశాల హిందీ అధ్యాపకులు అచార్య డాక్టర్ బి.లక్ష్మి మాట్లాడుతూ రాజ్యభాష హిందీ ప్రాముఖ్యతను తెలిపారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆహుతుల్ని అలరించాయి. ఎన్ఎస్ఎస్ బెస్ట్ వలంటీర్‌గా రాష్ట్ర స్థాయి అవార్డు సాధించిన అన్సువాకి 'దేవనాగరి' పురస్కారంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.దీప్తి, రెజీనా, సోఫియా, సర్తాజ్ పాల్గొన్నారు.

రోడ్లన్నీ చెత్తకుప్పల మయం



సీతమ్మధార రైతుబజార్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు




రైతుబజార్ సమీపంలో చెత్తతో నిండిపోయిన డంపర్‌బిన్

డంపర్‌బిన్లు నిండినా చెత్త తరలించని అధికారులు

సీతమ్మధార : నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడంతో స్థానికులు దుర్వాసన భరించలేక నరకయాతన అనుభవిస్తున్నారు. విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనుల నిమిత్తం అధిక సంఖ్యలో కార్మికులు తరలివెళ్లారు. ఫలితంగా నగరంలోని చాలా వార్డుల్లో పారిశుధ్యం పడకేసింది. ఒకవైపు వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తుండగా... మరోవైపు ఏ వీధి చూసినా చెత్తకుప్పలతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్యం లోపించడంతోపాటు వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. ముఖ్యంగా సీతమ్మధార రైతుబజార్ చెంతనే చెత్తకుప్పలు పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుబజార్ లోపల కూడా పారిశుధ్యం అంతంతమాత్రంగానే ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కనే చెత్తకుప్పలు పేరుకుపోతున్నా, డంపర్‌బిన్లు చెత్తతో నిండిపోయినా తరలించడం లేదని ఆరోపిస్తున్నారు. ఆ చెత్త వద్ద ఆవులు, కుక్కలు, పందులు చేరి ఇష్టానుసారంగా చెల్లాచెదురు చేస్తున్నాయని, ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ లైట్లు వెలగక అంధకారం



కప్పరాడలో వెలగని విద్యుత్ లైట్లు

కంచరపాలెం : జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి రాంజీ ఎస్టేట్, కప్పరాడ, పెదకొత్తూరు, అరుంధతినగర్, జవహర్‌లాల్‌నగర్ కొండవాలు ప్రాంతంలో విద్యుత్ వీధి లైట్లు వెలగక చీకట్లు కమ్ముకుంటున్నాయి. 91ఎ/1/5 విద్యుత్ స్తంభం నుంచి పలు స్తంభాల లైట్లు సక్రమంగా పనిచేయడం లేదు. జీవీఎంసీ విద్యుత్ సిబ్బందికి స్థానికులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. రాత్రి సమయంలో వీధుల్లో కుక్కల బెడదతోపాటు దొంగతనాల జోరు ఎక్కువగా ఉంది. చీకటిలో రాకపోకలు సాగించాలంటే మహిళలు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల ఫిర్యాదులు చేస్తే లైట్లు వేసినప్పటికీ... అవి రెండు రోజులకే పనిచేయకపోవడంతో మళ్లీ చీకట్లు కమ్ముకున్నాయి. 47వ వార్డులో సమస్యలు తెలుసుకునేందుకు కార్పొరేటర్ పర్యటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.